క్లుప్తంగా

విద్యార్థులకు కథల పోటీలు



కథల పోటీల్లో విద్యార్థులు

దుంబ్రిగుడ: మండల కేంద్రంలో ఉన్న శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా ఆదివారం గ్రంథాలయాధికారి శెట్టి సునీత ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు కథల పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుతులు కూడా అందజేస్తామన్నారు. ఈ వేసవి విజ్ఞాన తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె అన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ తరగతులు



పుస్తకాలు చదువుతున్న బాలబాలికలు

సాక్షి,పాడేరు: జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో బాలబాలికలకు వేసవి శిక్షణ తరగతులు ఉత్సాహంగా జరుగుతున్నాయి. గ్రంథాలయాధికారులు బాలబాలికలను తీసుకువచ్చి రోజువారీ పుస్తకాలు చదివే కార్యక్రమాలను అమలుజేస్తున్నారు. విజ్ఞానాన్ని పెంపొందించే లక్ష్యంగా బాలిబాలికలకు అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచుతున్నారు.జిల్లా కేంద్రమైన పాడేరులోని గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి సత్యవతి వేసవి శిక్షణ తరగతులను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం కూడా పుస్తకాలు చదివేందుకు బాలబాలికలు ఉత్సాహంగా గ్రంథాలయానికి తరలివచ్చారు.


వేసవి జాగ్రత్తలు పాటించాలి

● అరకు ఎమ్మెల్యే, చెట్టి పాల్గుణ



హుకుంపేట: ఏజెన్సీలో తీవ్రంగా మండే ఎండలకు గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. ఆయన శనివారం విలేఖరులతో మాట్లాడుతు ఏజెన్సీలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో గిరిజనులంత అప్రమత్తంగా ఉండాలని, వ్యవసాయ పనులకు వెళ్లినపుడు గిరిజనులు పలు జాగ్రత్తలు పాటించాలని, గొడుగులు తప్పనిసరిగా ఉపయోగించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు వెళ్లొద్దన్నారు. ఎండల్లో తిరుగకుండా ఇంట్లోనే ఉండాలని సూచించారు. ఉపాధి పనుల్లో వేతనదారులు పని ప్రదేశాల్లో ఏర్పాటుచేసిన టెంట్లు ఇతరత్రా సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని, ఎండ తక్కువగా ఉన్నప్పుడు పనులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



ఎంపీపీ రాజుబాబు

హుకుంపేట: ఒకవైపు మండే ఎండలు, మరో వైపు భారీ వర్షాలు, ఇలా రోజు మన్యంలో వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని, దీంతో సీజనల్ వ్యాధులు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయని ఎంపీపీ కూడా రాజుబాబు చెప్పారు. ఆయన ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతే వాతావరణంలో కలుగుతున్న మార్పుల వల్ల జలుబు, జ్వరాలతో పాటు తదితర లక్షణాలతో వ్యాధులు వచ్చే అవకాశం ఉందని గిరిజనులంతా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇంటి పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగునీరు, చెత్త నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఎలాంటి వ్యాధి లక్షణాలున్నా స్థానిక వైద్య సిబ్బందికి సమాచారం అందించి, తక్షణమే వైద్యుల ఆధ్వర్యంలో చికిత్స పొందాలని సూచించారు.

క్రాఫ్ట్‌వర్క్‌పై విద్యార్థులకు శిక్షణ

కొింటోట: మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు రంగు కాగితాలతో క్రాఫ్ట్ వర్క్ ఎలా చేయాలో ఆదివారం శిక్షణ ఇచ్చారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులు రాధాకృష్ణుల వేషంలో కోలాటా లు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపా. ధ్యాయుడు బి.సురేష్‌కుమార్, సచివాలయ కార్యదర్శి ఎం.మహేష్, గ్రంథాలయ అధికారి కె.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ఇంటింటా సంక్షేమం



గ్రామస్తులకు సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అనంతగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటింటా సంక్షేమం అమలవుతోందని, అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని మారుమూల పైనంపాడు పంచాయతీ కాంగువలస, ఈదులగరువు, జాకరవలస, పనసవర, చీమలతోట గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామస్తులకు ఎమ్మెల్యే పాల్గుణకు ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో 159 గడపలను ఎమ్మెల్యే సందర్శించారు. గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు, సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమాంతరంగా అమలుచేస్తున్న ఘనత ఆయన దేనన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలుచేస్తూ దేశానికి ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రజలందరూ మళ్లీ జగనన్న ప్రభుత్వమే అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారన్నారు. ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ అమలుచేసి, చిత్తశుద్ధిని నిరూపించుకున్నారన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మంచిని చూడలేకనే ఎల్లోమీడియా తప్పుడు ప్రచారం చేస్తోందని, దీనికి ప్రజలకే తగిన సమాధానం చెబుతున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎంపీపీ శెట్టి నీలవేణి, ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధరస్వామి, మాజీ వైస్ ఎంపీపీ గుండన్న, ఎంపీటీసీ సభ్యుడు తమ్మన్న, సర్పంచ్ సన్యాసిరావు, మార్కెట్ యార్డు డైరెక్టర్ సూర్యానారాయణ, స్వామి, గంగులు, వైఎస్సార్‌సీపీ పంచాయతీ కన్వీనర్లు సుబ్బారావు, రేవతి, బొజ్జన్న, సోషల్ మీడియా కన్వీనర్ రాజారావు, మన్య ప్రగతి చారిటబుల్ ట్రస్టు కో–ఆర్డినేటర్ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు గడుతూరులో 'గడప గడపకు'

జి.మాడుగుల: మండలంలో గడుతూరు పంచాయతీ మసేమెట్ట గొర్ద, పచ్చనాపల్లి గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం 2గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నుర్మని మత్స్యకొండంనాయుడు తెలిపారు. ట్రైకార్ చైర్మన్, ఎస్టీ సెల్ చైర్మన్, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, నామినేటెడ్ పదవుల్లో ఉన్న వివిధ శాఖల చైర్మన్లు, డైరెక్టర్లు, వార్డు సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అధికారులు హాజరు కావాలి

మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరుకావాలని ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు తెలిపారు. గడతురు పంచాయతీలో నాలుగు గ్రామాల్లో పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులతో పాటు సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొవాలని ఆయన తెలిపారు.

ఘనంగా అమ్మవారి పొలిమేర ఉత్సవం



అడ్డతీగలలో సోమాలమ్మ జాతరకు అంకురార్పణగా పొలిమేర ఉత్సవం నిర్వహిస్తున్న మహిళలు

అడ్డతీగల: మండల కేంద్రంలోని సోమాలమ్మ అమ్మవారి ఉత్సవం సందర్భంగా పొలిమేర జాతర ఘనంగా ఆదివారం నిర్వహించారు. ఏటా సోమాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలకు వారం రోజుల ముందు గిరిజన మహిళలు నెత్తిన పసుపు నీళ్ల బిందెలను ఉంచుకుని డప్పు వాయిద్యాల నడుమ సంప్రదాయంగా అమ్మవారిని దర్శించుకుంటారు. అనంతరం గ్రామంలోని ప్రధాన సెంటర్ మీదుగా ఊరేగింపుగా సీతపల్లి జంక్షన్ వరకూ వెళతారు.అక్కడ వారి వద్ద బిందెల్లో ఉన్న పసుపు నీళ్లను పొలిమేరలో రహదారికి అడ్డంగా పోస్తారు. గ్రామంలోనికి దుష్టశక్తులు ప్రవేశించకుండా కావలి కాసి ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని సోమాలమ్మని కోరుకుంటూ అత్యంత భక్తిశ్రద్ధలతో పొలిమేర ఉత్సవాన్ని నిర్వహిస్తారు.

ఉత్తమ విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న సత్యనారాయణ, ఎంపీటీసీ, స్థానికులు

కొయ్యూరు: తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ దుమంతి సత్యనారాయణ ఆధ్వర్యంలో చింతవానిపాలెంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఇటీవల పదో తరగతిలో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. అడవి బిడ్డలకు విద్యా దానం పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చదువు ద్వారా పేదరికాన్ని జయించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మండిబి తేజశ్రీ,, జర్తా దుర్గాప్రసాద్, కూనిశెట్టి శాంతిప్రియలను సన్మానించారు. కొయ్యూరు ఎంపీటీసీ కె.మల్లికార్జున్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించిన దాన్ని సాధించేందుకు కృషి చేయాలన్నారు. గ్రామస్తులు అరవింద్, నరేష్, దేముడు తదితరులు పాల్గొన్నారు

పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి



పోలీసు స్టేషన్ ప్రహరీ పనులు పరిశీలిస్తున్న సీఐ రాంబాబు

వై.రామవరం: స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో నిర్మిస్తున్న నూతన పోలీసు స్టేషన్ భవనాన్ని అడ్డతీగల సీఐ వై.రాంబాబు ఆదివారం పరిశీలించారు. నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేందుకు తగు చర్యలు తీసుకోమని అడిషినల్ ఎస్ఐ కె.రాంబాబుకు ఆదేశించారు. నిర్మిస్తున్న ప్రహరీ తదితర పనుల నాణ్యతను తనిఖీ చేశారు. స్టేషన్ భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణలో ఉన్న సీఆర్‌పీఎఫ్ డి42–బెటాలియన్ పోలీసుల భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. విధుల నిర్వహణపై సిబ్బందికి సలహాలు సూచనలిచ్చారు. అడ్డతీగల ఎస్ఐ జి.అప్పలరాజు, సీఆర్‌పీఎఫ్ డి42–బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎం.ఎల్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా పోలీసుల తనిఖీలు



చింతపల్లిలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

చింతపల్లి రూరల్: అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా చర్యలు చేపడుతున్నమని ఎస్ఐ రమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో తహసీల్దార్, మండల పరిషత్, అటవీశాఖ కార్యాలయాలు, కాఫీ పల్పింగ్ యూనిట్‌ల వద్ద డాగ్ స్క్వాడ్‌లతో విస్తృత తనిఖీలు నిర్వహించారు.వాహన రికార్డులు పరిశీలించారు.



రాజవొమ్మంగిలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని పోలీసులు ఆదివారం విస్తృతంగా వాహనాల తనిఖీ చేపట్టారు. రాజవొమ్మంగి మీదుగా నర్సీపట్నం, కొయ్యూరు నుంచి ఏలేశ్వరం, రంపచోడవరం, భద్రాచలం, రాజమండ్రి తదితర ప్రాంతాల వైపు వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రయాణికుల లగేజీలను సోదా చేశారు. వాహనాల రికార్డులను పరిశీలించారు. అడిషనల్ ఎస్ఐ జాన్‌కుమార్ ఆధ్వర్యంలో సాయుధ పోలీసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కోలాటం కళాకారులకు చీరల వితరణ

కె.కోటపాడు : సూదివలస గ్రామంలో కోలాటం మహిళలకు ఎంపీటీసీ వర్రి రామునాయుడు తన సొంత నగదుతో ఏకరూపు చీరలను సమకూర్చారు. ఆదివారం గ్రామంలో కోలాటం గ్రూపులకు చెందిన 30 మంది మహిళలకు వీటిని అందించారు. కోలాటం ప్రదర్శనలతో మహిళలు ప్రజల్లో భక్తిభావాన్ని మరింతగా పెంపొందించాలని సూచించారు. ఈ చీరల కొనుగోలుకు రూ.20 వేల నగదు వెచ్చించినట్టు తెలిపారు.

మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

రావికమతం : మరుపాక మోడల్ స్కూల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ సత్య సునీల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో పదోతరగతి పాసైన వారు ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. http:// apms. apcfss. in, http:// cse. ap. gov. in వెబ్‌సైట్ల ద్వారా ఈ నెల 22 నుంచి జూన్ 7 వరకు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.200 ఫీజు చెల్లించాలన్నారు.

త్రినాథరావు ఎంపికపై హర్షం



త్రినాథరావు

దుంబ్రిగుడ: ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సమావేశం ఈ నెల 20న విజయవాడలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అల్లూరి జిల్లా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల నూతన కార్యకర్గం ఎన్నిక నిర్వహించినట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా శెట్టి త్రినాథరావు, ఉపాధ్యక్షుడిగా పి.అర్జున్, ప్రధాన కార్యదర్శిగా కోటిబాబు, కోశాధికారిగా కృష్ణకుమార్, జాయింట్ సెక్రటరీగా రంజిత్‌కుమార్, సభ్యులుగా ఎస్.కోటేశ్వరరావు, పి.స్వామిను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఈ సందర్భంగా శెట్టి త్రినాథరావు ఎంపికపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

గడ్డికుప్ప దగ్ధం



మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అనకాపల్లిటౌన్: గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయ సమీపంలో రమణమ్మ ఖాళీ స్థలంలో ఉన్న గడ్డికుప్ప అగ్నికి ఆహుతి అయింది. స్థానిక అగ్నిమాపక శాఖ అధికారి బి.నర్సింగరావు మాట్లాడుతూ పక్కనే ఉన్న తోటలో వంటలు చేస్తున్న సమయంలో అగ్గి నిప్పులు గాలికి వచ్చి గడ్డి కుప్పపై పడడంతో మంటలు వ్యాపించినట్లు తెలిపారు. సుమారు రూ. 30 వేల ఆస్తి నష్టం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు



సతకంపట్టువద్ద అమ్మవారి పాదాలను దర్శించుకుంటున్న భక్తులు

మాడుగుల : వచ్చే నెల 6న జరగనున్న మోదకొండమ్మ పండగ సందర్భంగా కోటబయలులోని సతకంపట్టు వద్ద కొలువు దీరిన మోదకొండమ్మకు ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని ఈ ప్రాంత భక్తుల విశ్వాసం. గ్రామంతో పాటు ఇతర గ్రామాలు నుంచి వచ్చిన భక్తులుతో సతకం పట్టువద్ద పండగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో భక్తులతో పాటు, ఆయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి పండగ



సత్తెమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక : మునగపాకలో పలు చోట్ల ఆదివారం సత్తెమ్మతల్లి అమ్మవారి పండుగలు ఘనంగా జరిగాయి. మునగపాక బీసీ కాలనీ, మూలపేటకు వెళ్లే దారిలోని తంపరమూల ప్రాంతాల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, పార్టీ అధికార ప్రతినిధి ఆడారి కాశీబాబు, తంపరమూల రైతు సంఘ అధ్యక్షుడు కాండ్రేగుల మణికంఠ అమ్మవారిని దర్శించుకున్నారు.

కరాటే చాంపియన్‌కు అభినందన



కరాటే చాంపియన్ ఈశ్వరరావును అభినందిస్తున్న దాడి రత్నాకర్

తుమ్మపాల: 19వ ఇంటర్‌నేషనల్ కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్–2023(మలేషియా) పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించిన టి.ఈశ్వరరావును వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ తన నివాసంలో ఆదివారం అభినందించారు. కరాటే చాంపియన్లు విదేశాల్లో సైతం ప్రతిభ కనబరచి విజయాలు సాధించడం దేశానికి గర్వకారణమన్నారు. ప్రభుత్వం క్రీడాకారులను అన్ని విధాలా ప్రోత్సహిస్తుందన్నారు. కరాటేలో బ్లాక్ బెల్ట్ డివిజన్ 84 కేజీల కేటగిరిలో ఈశ్వరరావు గెలుపొందారు.

మన్యంలో అడ్డాకుల సిరులు



ఘాట్‌రోడ్డులోని వంట్లమామిడి సంతలో అడ్డాకులను విక్రయిస్తున్న గిరిజనులు

● జోరందుకున్న వ్యాపారం
● కావిడ రూ.2000తో అమ్మకాలు



మోదాపుట్టులో గిరిజనుల ఇంటి ముందు ఆరబెట్టిన అడ్డాకులు

సాక్షి,పాడేరు: అడవి తల్లినే నమ్ముకుని జీవించే గిరిజనులకు ఈ సీజన్‌లో అడ్డాకులు సిరులు కురిపిస్తున్నాయి. ప్లాస్టిక్ వాడకం రానురాను తగ్గుతుండడంతో అడ్డాకులకు మరలా ఆదరణ నెలకొంది. హోటళ్ల నిర్వాహకులతో పాటు ప్రజలు కూడా అడ్డాకులను వినియోగిస్తుండడంతో ఏజెన్సీ వ్యాప్తంగా అడ్డాకులకు డిమాండ్ నెలకొంది. అటవీ ప్రాంతాలలో అడ్డాకుల సేకరణ జోరందుకుంది. వాటిని సేకరించి, గిరిజనులు తమ ఇళ్ల ముందు ఆరబెట్టి, వాటిలో తేమపోయిన వెంటనే కట్టలు కట్టి అమ్మకాలకు సిద్ధం చేస్తున్నారు. కొందరు ఆయా కట్టలను వారపు సంతలకు తరలించే పనుల్లో నిమగ్నమయ్యారు.

ఆశాజనకంగా ధరలు..ఆనందంలో గిరిజనులు

ఏజెన్సీలోని అన్ని వారపు సంతల్లోను అడ్డాకుల వ్యాపారం జోరందుకుంది. అడ్డాకుల సేకరణ, అమ్మకాల సీజన్ కావడంతో సంతల్లో భారీగానే వ్యాపారం జరుగుతుంది.ఆదివారం అరకులోయ మండలం సుంకరమెట్ట, పాడేరు మండలం వంట్లమామిడి, జి.కే.వీధి మండలం దారకొండ వారపు సంతల్లో అడ్డాకుల వ్యాపారం పెద్ద మొత్తంలో జరిగింది. గిరిజనులంతా కావిళ్లతో అడ్డాకులను సంతలకు మోసుకువచ్చి అమ్మకాలు జరిపారు. కావిడ(రెండు దిండ్లు)ను రూ.2000 ధరతో అమ్మకాలు జరపడంతో గిరిజనులకు మంచి ఆదాయం నెలకొంది. సుంకరమెట్ట సంతలో కొనుగోలు చేసిన అడ్డాకులను ఎస్.కోట, విజయనగరం, విశాఖపట్నం ప్రాంతాలకు, వంట్లమామిడిలో కొనుగొలు చేసిన అడ్డాకులను కొత్తకోట, చోడవరం, మాడుగుల, నర్సీపట్నం, గాజువాక, అనకాపల్లి తదితర ప్రాంతాలకు, దారకొండ సంతలో కొనుగోలు చే సిన అడ్డాకులను కూడా మైదాన ప్రాంతాలకు వ్యాపారులు తరలిస్తున్నారు.అడ్డాకుల సేకరణ,అమ్మకాలతో గిరిజనులకు ఈసీజన్‌లో మంచి ఆదాయం నెలకొంటుంది.ఈ ఏడాది ఆక్టోబర్ నెల వరకు అడ్డాకుల వ్యాపారం జరుగుతుంది.

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ రామన్న, మండల కన్వీనర్ సంపత్‌కుమార్

అరకులోయ రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, మండల కన్వీనర్ పట్టాసి సంపత్‌కుమార్ అన్నారు. వారు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో కలుగుతున్న మార్పులతో వ్యాధులు ప్రబలే అవకాశముందని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిందని, ఇందులో భాగంగా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రవేశపెట్టి, ప్రజల చెంతకే వైద్య సేవలందిస్తోందన్నారు. వైద్యులు గ్రామాల్లో పర్యటించి, ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలందించడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం ఏజెన్సీలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని, భారీ ఈదురుగాలులతో పాటు ఉరుములు, మెరుపులుంటున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాలు పడే సమయంలో పిడుగులు పడుతున్నాయని ప్రజలు చెట్లు కింద, వ్యవసాయ ప్రదేశాల్లో ఉండవద్దని, సురక్షితమైన భవనాల్లోనే ఉండాలని సూచించారు.

జనావాసాల మధ్య మరుగుదొడ్ల పనులు నిలిపివేయాలి



ఎంపీటీసీ అరుణకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

అనంతగిరి: మండలంలోని బొర్రా పంచాయతీ కేంద్రంలోని పాత పంచాయతీ భవనాన్ని మరుగుదొడ్లుగా మారుస్తున్నారని, పనులను వెంటనే నిలిపివేయాలని, గేటువలస గ్రామస్తులు ఆదివారం ఆందోళన చేపట్టారు. జనవాసాల మధ్య మరుగుదొడ్లు చేపట్టడం ద్వారా అనారోగ్యానికి గురవుతున్నామని, గ్రామానికి దూరంగా నిర్మించాలని గిరిజనులు వాపోయారు. ఈ మేరకు బొర్రా ఎంపీటీసీ అరుణకు వినతిపత్రం అందజేశారు. జనావాసాల మధ్యలో మరుగుదొడ్డు నిర్మాణం నిలిపివేసే విధంగా మండలశాఖ అధికారులు దృష్టికి తీసుకువెళ్తామని, అరుణ హామీ ఇవ్వడంతో స్థానికులు ఆందోళన విరమించారు.

భక్తిశ్రద్ధలతో నూకాంబిక అమ్మవారికి పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లిటౌన్: గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి తరలి రావడంతో ఆలయం క్యూలైన్లు కిటకిటలాడాయి. కొంతమంది భక్తులు ఆలయ ఆవరణలో ఉన్న చలువ పందిళ్లలో వంటలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కుటుంబ సమేతంగా భోజనాలు చేసి అమ్మవారి ఆశీస్సులు పొంది ఆనందంగా తిరుగుముఖం పట్టారు. పలు స్వచ్ఛంద సంస్థలు ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత మజ్జిగ, తాగునీరు అందించాయి. ఆలయానికి వచ్చే భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి ప్రసాదాన్ని ఉచితంగా అందజేశారు. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక దర్శనం కల్పించి బాలింతలు వారి పిల్లలకు పాలిచ్చేందుకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్ ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐలు దాడి మోహనరావు, టి.శ్రీను ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ద్విచక్ర వాహనాలను మాత్రమే అమ్మవారి ఆలయం వరకూ అనుమతించి, మిగిలిన వాహనాలను పార్కింగ్ ప్రదేశాల్లో నిలుపుదల చేశారు.

మోదకొండమ్మకు వెండి పాదాలు



అమ్మవారి పాదాల ఊరేగింపులో భక్తులు

మాడుగుల రూరల్ : కె.జె.పురం మోదకొండమ్మ అమ్మవారికి గ్రామానికి చెందిన యల్లపు త్రినాథ్, మౌనిక కుటుంబ సభ్యులు రెండున్నర కిలోల వెండితో తయారు చేసిన పాదాలను ఆదివారం ప్రతిష్ఠించారు. వీటి విలువ సుమారు రూ.2.30 లక్షలు. ముందుగా వెండి పాదాలను పుర వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ జామి రమణబాబు, నాయకులు ఆడారి కన్నారావు, యల్లపు శ్రీను, జగ్గప్పారావు, అచ్చిమి నాయుడు, ఆడారి సన్యాసినాయుడు, సురేష్, కాళ్ల అమ్మతల్లి నాయుడు, ఆడారి శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.